కేంద్రాలు తెరిచి.. కొనుగోళ్లు మరిచి..

ధాన్యంతో నిండిపోయిన కొనుగోలు కేంద్రాలు.. మారుతున్న వాతావరణ పరిస్థితులతో రైతుల ఆందోళన

చేర్యాల, ఏప్రిల్ 8: ప్రభుత్వం రైతులు పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతన్నలు పడిగాపులు కాస్తున్నారు. గత పదేండ్లలో రైతులు ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. యాసంగి సీజన్ ధాన్యం పంట చేతికి రావడంతో 20 రోజుల క్రితమే చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని రైతులు వరికోతలు ప్రారంభించారు. పంట పొలాల్లో కోతను కోసి నేరుగా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రాసులు పోస్తున్నారు. ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేర్యాల మండలంలో 21, మద్దూరు ఉమ్మడి మండలంలో 20, కొమురవెల్లి మండలంలో 8 కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో కొన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత శాఖ అధికారులు ఈ నెల మొదటి వారంలో ప్రారంభించినప్పటికీ కొనుగోలు ప్రారంభం కాలేదు. మరికొన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. బీఆర్ఎస్ సర్కారు పాలన లెక్కనే సకాలంలో అధికారులు కేంద్రాలు తెరిచి ధాన్యం కొనుగోలు చేస్తారని భావించిన రైతులు ధాన్యం తీసుకు

చేర్యాల మండలం ఆకునూరులో ధాన్యంతో నిండిపోయిన కొనుగోలు కేంద్రం

వచ్చి కేంద్రాల్లో పోసి రాసుల రక్షణ కోసం కాపలాకాస్తున్నారు.కొన్ని గ్రామాల్లో ఇప్పట్లో కేంద్రాలు ప్రారంభమయ్యే పరిస్థితి లేకపోవడం, కేంద్రాలు ప్రారంభించిన గ్రామాల్లో కాంటాలు కాక రైతులు మధ్య దళారులకు తక్కువ ధరకు విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు.ప్రభుత్వ మద్దతు ధర రూ.2320 ఏ గ్రేడ్, కామన్ రకానికి 2300 ప్రకటించింది. రోజురోజుకు మారుతున్న వాతావరణ పరిస్థితులు, వర్షాలు కురుస్తుండడంతో వరి ధాన్యాన్ని విక్రయించుకోలేక రైతులు సతమతమవుతున్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులకు అక్కడ ఎలాంటి వసతులు లేవు. తాగునీటి వసతి, టార్పాలిన్లు, టెంట్లు, ధాన్యాన్ని తూర్పార పట్టేందుకు, జల్లి చేసేందుకు యంత్రాలు, బస్తాలు ఇప్పటి వరకు కేంద్రాల వద్ద లేవంటే ధాన్యం కొనుగోలు, రైతుల పట్ల సర్కారుకు ఉన్న చిత్తశుద్ధి తేటతెల్లమవుతున్నది. మద్దూరు, ధూళిమిట్ట, కొమురవెల్లి, చేర్యాల మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కాంటాలు జరగక మధ్య దళారులు నేరుగా లారీ, ట్రాక్టర్లు తీసుకువచ్చి ధాన్యం కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ ప్రారంభించి రైతులను ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ముందే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం

చేర్యాల మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 11 కేంద్రాలు ప్రారంభించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేంద్రాలను ముందే ఏర్పాటు చేశాం. ఇటీవల రైతులు వరి కోతలు ప్రారంభించారు. కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులు తమ ధాన్యం మధ్య దళారులకు విక్రయించకుండా ఉండడమే కాకుండా ప్రభుత్వ మద్దతు ధర పొందుతారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులకు అన్ని వసతులు కల్పిస్తున్నాం.ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రకాశం, ఏపీఎం, ఐకేపీ, చేర్యాల మండలం

మూడు ఫేజ్‌ల్లో రిజర్వాయర్లు నింపాలి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

లద్నూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 8: వచ్చే వానకాలం నుంచి మూడు ఫేజ్‌ల్లో నియోజకవర్గంలోని అన్ని రిజర్వాయర్లు నింపాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మద్దూరు మండలంలోని లద్నూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్దూరు మండలంలోని లద్నూర్ రిజర్వాయర్ లీకేజీ అవుతుందని రైతులు ఫిర్యాదు చేశారన్నారు. లీకేజీని అరికట్టేందుకు కొంత ప్రయత్నం చేసినా సరిచేయలేకపోయినట్లు తెలిపారు. లద్నూర్ రిజర్వాయర్‌ను పూర్తిగా నింపుకునేందుకు కావాల్సిన నీళ్లు ఓఎండీ సిబ్బంది 34 రోజుల పాటు సమ్మె చేసినా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పిన తర్వాత నీళ్లు వచ్చాయన్నారు. బొమ్మకూరు లెఫ్ట్ కెనాల్ నుంచి లద్నూర్ మీదుగా తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి నీళ్లు వెళ్తుంటాయన్నారు. గతంలో దేవాదులలో 350 క్యూసెక్కుల నీళ్లు ఫేజ్-1లో, 550 క్యూసెక్కుల నీళ్లు ఫేజ్-2లో వచ్చేవన్నారు. మూడో ఫేజ్‌లో 1800 క్యూసెక్కుల నీళ్ల విడుదల కోసం గత ప్రభుత్వం నిర్ణయించగా ఈ ప్రభుత్వం నీటిని విడుదల చేసిందన్నారు. ఏఎంసీ చైర్పర్సన్ నల్లనాగుల శ్వేత, వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుమలతామల్లేశం, మాజీ సర్పంచ్‌లు సుదర్శన్, వెంకటరమణారెడ్డి, బాలరాజు, మాజీ ఎంపీటీసీ సమ్మయ్య, సొసైటీ మాజీ డైరెక్టర్ కాసర్ల కనకరాజు, ఊట్ల శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

అంతియయాత్రలో పాల్గొని పాడె మోస్తున్న యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 8: మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య తల్లి తారాబాయి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి తారాబాయి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 8: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జడ్జి స్వాతిరెడ్డి సూచించారు. సిద్దిపేట జిల్లా జైలును మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీల వంటగది, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. అంతకుముందు ఖైదీలతో మాట్లాడి భోజన తదితర వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో జైలర్ వికాస్, న్యాయ సిబ్బంది వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

నిరసన తెలుపుతున్న సిద్దిపేట ఓయూ పీజీ కళాశాల అధ్యాపకులు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 8: కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట ఓయూ పీజీ కళాశాల అధ్యాపకులు తరగతులు బహిష్కరించి మంగళవారం కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఓయూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవినాథ్ మాట్లాడుతూ.. పార్ట్‌టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిరసన వ్యక్తం చేశామన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని.. అది ఆలస్యమైతే హెచ్‌ఆర్‌ఏ, డీఏ, 3శాతం ఇంక్రిమెంట్‌తో కూడిన ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో 21కారణంగా కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయన్నారు. అధ్యాపకులకు విద్యార్థులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఒప్పంద అధ్యాపకులు రాజు, ఉపేందర్, నర్సయ్య,చంద్రశేఖర్, సౌజన్యకుమార్, విధిశ, ఛత్రపతి, రత్నాకర్‌చారి, సౌందర్య, శివకుమార్, శంషాద్‌అలీ, సతీశ్‌కుమార్, స్వాతి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సిద్దిపేట, ఏప్రిల్ 8: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని పీఏసీఎస్ చైర్మన్ నల్ల నరేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్, రావురుకుల, రాఘవపూర్, పెద్దలింగారెడ్డిపల్లి, బండచెర్లపల్లి, సిద్దిపేట అర్బన్ మండలం గాడిచెర్లపల్లి, బూర్గుపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ డైరెక్టర్ అన్నసారం పరమేశ్వర్‌గౌడ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు భిక్షపతి, రవి, తిరుపతి, దశరథం, కమలాకర్‌రావు, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వంగరామయ్యపల్లిలో

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 8: మండలంలోని వంగరామయ్యపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ భూక్యా తిరుపతి, నాయకులు రమేశ్‌నాయక్, రవినాయక్, హమాలీ సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 8: నూతనంగా వచ్చిన సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ రఘు మంగళవారం మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మోడ్రన్ బస్టాండ్‌లో చెత్త మూలంగా ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేకంగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేయాలని మేనేజర్ కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో ఐదోవార్డు కౌన్సిలర్ అన్నగోని వినోద్‌గౌడ్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి

గజ్వేల్: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

చేర్యాల: సమావేశంలో మాట్లాడుతున్న శెట్టిపల్లి సత్తిరెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 8: కేంద్రం పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం చేర్యాల పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాల వల్ల పేదలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో కేంద్రం వంట గ్యాస్‌పై రూ.50 పెంచడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డాడు. వెంటనే పెంచిన ధరను తగ్గించాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్ మావో, చేర్యాల, కొమురవెల్లి మండల కార్యదర్శులు అరుణ్‌కుమార్, రవీందర్, నాయకులు ప్రభాకర్, కుమార్, మల్లేశం, స్వర్గం శ్రీకాంత్, దాసరి బాలస్వామి పాల్గొన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట, ఏప్రిల్ 8: పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్ల బండి శశిధర్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ ధరను కేంద్రం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేటలో వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జాలిగపు శిరీష, దాసరి ప్రశాంత్,నాయకులు బత్తుల అభినవ్, వంగ రవీందర్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్, ఏప్రిల్ 8: కేంద్రం పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ మాట్లాడుతూ పేదలపై భారం పడేలా గ్యాస్ ధర పెంచడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో కొండకింది పోచయ్య, రమణాకర్, సాయి, కుమార్, భిక్షపతి, ఎల్లం, కనకయ్య, రాజయ్య పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 8: వరంగల్‌లో ఈ నెల 27న బీఆర్ఎస్ తలపెట్టిన రజతోత్సవ సభను విజయవంతం చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం మద్దూరులోని తాజ్ మహల్ గార్డెన్‌లో బీఆర్ఎస్ మద్దూరు, ధూళిమిట్ట మండలాల అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన మద్దూరు, ధూళిమిట్ట మండలాల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా శాంతియుతంగా తెలంగాణ ఉద్యమం కొనసాగిందన్నారు. 14 ఏండ్ల పోరాటం తర్వాత సాధించుకున్న తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. జనగామ నియోజకవర్గంలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ నాచగోని పద్మావెంకట్‌గౌడ్, చేర్యాల జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్యపంతులు, బీఆర్ఎస్ మద్దూరు టౌన్ ప్రెసిడెంట్ దామెర మల్లేశం, నాయకులు వంగ భాస్కర్ రెడ్డి, గూళ్ల ఆనందం, కర్ర అరుణ, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అహిల్యా బాయ్ హోల్కర్ విగ్రహావిష్కరణ

గజ్వేల్, ఏప్రిల్ 8: పట్టణంలోని పిడిచేడ్ మార్గంలో మహంకాళి అమ్మవారి దేవాలయం సమీపంలో అహిల్యా బాయ్ హోల్కర్ విగ్రహాన్ని మంగళవారం సామాజిక సమరత వేదిక ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సామాజిక సమరత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర నరేశ్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటగా అహిల్యాబాయ్ హోల్కర్ విగ్రహాన్ని గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన హైందవ సోదరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్టు అమలు

గజ్వేల్, ఏప్రిల్ 8: నకిలీ విత్తనాలు, ఎరువులు, మందులు అమ్మే వారిపై పీడీయాక్టు అమలు చేసి కేసు నమోదు చేయిస్తామని ఏడీఏ బాబునాయక్ డీలర్లను హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని రైతువేదికలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి డీలర్ విధిగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అనుమతి కలిగిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలని సూచించారు. ప్రతి రైతుకు కొనుగోలు చేసిన దానికి రసీదు ఇవ్వాలని, రైతు సంతకాలు రసీదులో తీసుకోవాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేయిస్తామని, స్టాకు రిజిస్టరు తప్పకుండా రాయాలన్నారు. కాలం చెల్లిన విత్తనాలు అమ్మితే చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో నాగరాజు, ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే చర్యలు

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 8: మున్సిపల్ వాహన సిబ్బందికి చెత్త ఇవ్వకుండా బహిరంగ ప్రదేశాల్లో వేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవా రం హుస్నాబాద్ పట్టణంలోని 1, 3వ వార్డుల్లో చెత్త విభజన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో 40 శాతం మంది మాత్రమే చెత్తను వేరుచేసి ఇస్తున్నారని, ఇది 100 శాతం అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు. చెత్తవిభజనను సక్రమంగా నిర్వహించి పట్టణాన్ని పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, వార్డు అధికారులు వెంకటేశ్, సాంబరాజు, సత్తార్, వెంకటేశ్, బేసిల్ ఫౌండేషన్ సూపర్‌వైజర్ నవీన్, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ జవాన్లు పాల్గొన్నారు.

యువిక-2025కి మోడల్ స్కూల్ విద్యార్థులు

దుబ్బాక, ఏప్రిల్ 8: యువిక-2025 ప్రోగ్రాంకు దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి మొత్తం 12 మంది విద్యార్థులు ఎంపికకాగా ఇందులో లచ్చపేట మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉండటం విశేషం. ఇస్రో ఆధ్వర్యంలో ఏటా ప్రతిష్టాత్మకంగా యువిక ప్రోగ్రాం నిర్వహిస్తుంది. యువిక-2025 కార్యక్రమానికి లచ్చపేట మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు హర్షవర్ధన్, కౌశిక్, సుశాంత్ ఎంపికయ్యారు. వీరికి మే 18 నుంచి ఇస్రో ఆధ్వర్యంలో ఉపగ్రహ నిర్మాణం, రాకెట్ లాంచింగ్, అంతరిక్ష పరిజ్ఞానం తదితర వాటిపై 15 రోజుల పాటు ప్రాథమిక శిక్షణ ఇస్తారు. యువికకు ఎంపికైన ముగ్గురు విద్యార్థులను మంగళవారం ఎంఈవో ప్రభుదాస్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, సీఆర్పీ నవీన్, ఉపాధ్యాయులు నాగరాజు, జ్యోతి, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కొమురవెల్లి, ఏప్రిల్ 8 : రైలుకు ఎదురెళ్లి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గౌరాయపల్లిలో శివారులోని రైల్వే పట్టాలపై చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కబీర్‌దామానికి చెందిన ప్యారేలాల్‌వర్మ కుటుంబ సభ్యులతో కొన్నేండ్ల క్రితం ఉపాధి కోసం సిద్దిపేటకు వచ్చాడు. ఇటీవల దుద్దెడకు చెందిన మేస్త్రీ వద్ద ప్యారేలాల్‌వర్మ భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. ప్యారేలాల్‌వర్మ చిన్నకుమారుడు రుపేశ్‌వర్మ(18) తన కుఫోన్ కొనివ్వాలని పట్టుబట్టాడు. పైసలు వచ్చిన తర్వాత కొనిస్తానని తండ్రి చెప్పగా మంగళవారం గౌరాయపల్లి శివారులో రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలానికి కొమురవెల్లి ఎస్సై రాజు చేరుకొని వివరాలు తెలుసుకున్నాడు. మృతుడి సోదరుడు గణశ్యామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థినులు ఒత్తిడికి లోనుకావద్దు

మాట్లాడుతున్న నందిని

చిన్నకోడూరు, ఏప్రిల్ 8: విద్యార్థినులు అధిక ఒత్తిడికి లోనైప్పుడు తమ సమస్యలను తోటి స్నేహితులు, ఉపాధ్యాయులు, తమ తల్లిదండ్రులతో పంచుకోవాలని మానసిక నిపుణురాలు డాక్టర్ నందిని సూచించారు. మంగళవారం మండలంలోని ఇబ్రహీంనగర్ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో చెలిమి కార్యక్రమం నిర్వహించారు. మానసిక ఆందోళనకు గురైనప్పుడు వాటి నుంచి ఎలా బయటపడాలో విద్యార్థినులకు ఆమె వివరించారు. మానసిక సమస్యలతో నిద్రలేమి మొదలైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహిస్తాం

హుస్నాబాద్ దళిత సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల చంద్రమౌళి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 8: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ జయంతిని ఈనెల 14న ఘనంగా నిర్వహిస్తామని దళిత సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ బత్తుల చంద్రమౌళి, మాజీ వైస్ ఎంపీపీ గడిపె మల్లేశ్ అన్నారు. హుస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో మంగళవారం దళిత సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశించిన న్యాయం దళితులకు దక్కడంలేదన్నారు. దళితులంతా ఐక్యంగా ఉంటేనే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. సమావేశంలో మాజీకౌన్సిలర్లు బొజ్జ హరీశ్, దండి లక్ష్మి, నాయకులు వెన్నరాజు, గడిపె కొమురయ్య, బోజు రవి, యాస శ్రీనివాస్, మొగిలిపాక శ్రీనివాస్, బాబు, సంపత్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న గుండెల్లి వేణు, గుజ్జ రాజు

చిన్నకోడూరు, ఏప్రిల్ 8: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే టీఆర్ఎస్ 25వ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు గుండెల్లి వేణు, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు గుజ్జ రాజు కోరారు. మంగళవారం చిన్నకోడూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ బహిరంగ సభకు మండలం నుంచి విద్యార్థి, యువత పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచన మేరకు సిద్దిపేట రంగధాంపల్లి చౌరస్తా నుంచి సభా ప్రాంగణం వరకు విద్యార్థి యువత పాదయాత్ర చేస్తారన్నారు. 25న సిద్దిపేటలో ప్రారంభమైన పాదయాత్ర 27వరకు సభా ప్రాంగణానికి చేరుకుంటుందన్నారు. సమావేశంలో విద్యార్థి యువత, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గరిమాఅగర్వాల్

కొమురవెల్లి, ఏప్రిల్ 8: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వం ఎంపిక చేసిన మోడల్ విలేజ్ పోసాన్‌పల్లిని ఆమె సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండ్ల నిర్మాణ పనులపై ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కొమురవెల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆమె సందర్శించి వసతులను పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలన్నారు. తహసీల్దార్ దివ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస